తిన్నగా నా కోర్కె తెలుపనే లేదు.

ఇలాంటి రక రకాల భావాల్ను కాగితాలమీద రాసి బట్టల పెట్లో నా టాయిలెట్ బాక్సులో పెట్టివుంచా, అవి పోస్టుచేయని ప్రేమలేఖలు. పెట్టె సర్దుతూన్నప్పుడల్లా అడ్డువస్తూంటాయి. చింపలేను. పారేయడానికి మనసొప్పదు.

# ఐ పిటీ యు

మా ఆడబడుచుకూతురు తిరుమల వేంకటలక్ష్మి ప్రసన్న కుమారి (గుంట ముండకు నాలుగై దేళ్ళుంటాయి) రాత్రిళ్ళు వచ్చి అందరిపక్కలలోనూ పడి నిద్రపోయి, ఓ రాత్రివేళ ఎవరి పక్కో తడిపేసి పుణ్యం కట్టుకుంటూ వుంటుంది. దానికి 'జలఉష' అని పేరెట్టాం. నెహ్రూగారికి మల్లే నాక్కూడా కొంచెం శాన్స్క్రిట్ వచ్చు. మనవాళ్ళు విమానానికి 'మేఘదూత్' అని, ట్రాంబేలో అణుశక్తి కేంద్రానికి 'అప్సర' అనీ, మిలిటరీ ట్రక్కుకి 'శక్తిమాన్' అని పేర్లు పెట్టలా? రోడ్లపేర్లుకూడా కింగ్సువేకి రాజపథ్ అనీ, క్వీన్స్‌వేకి జనపథ్ అని మార్చారు. అందుకే నేను నెహ్రూగారితో పోటీపడి తిరుమల వేంకటలక్ష్మి ప్రసన్నకుమారికి జలఉష అని పేరెట్టా. ఉషా అంటే అది పలుకుతుంది. ప్రసన్న అంటే మాట్లాడదు.

ఇప్పుడు రైటర్సుగూడా సుబ్బారావు అనే పేరుకు బదులు సురేష్. శంకరానికి బదులు శేఖర్ యిలా హిందీ, సంస్కృత, బెంగాలీ మయమైన పేర్లను వాడుతున్నారు. సుబ్బమ్మ అనే పేరు సుజాతగా మార్చుకుంటున్నారు.

సినిమా కథలలో పాత్రలకు వెంకట్రావు, పోలుపిల్లి, సత్యనారాయణ, నరసయ్య, తలుపులు లాంటి పేర్లంటే హీరోయిన్లు యాక్టు చేయరట. అచ్చ తెలుగు పేర్లు తీసేసి రాజశేఖర్, గోపాల్, సురేష్, రాజా లాంటి పేర్లు తగిలించకపోతే ఆ కథ అడ్డం తిరుగుతుందట.

కమింగ్ టు ది పాయింట్ – కొంచెం అంగ్రేజి వచ్చినవాళ్ళ వల్ల ఎక్కువ డేంజరా? కొంచెం శాన్స్క్రిట్ వచ్చినవాళ్ళ వల్ల ఎక్కువ డేంజరా అంటే ఐడోంట్నో. కొంచెం నాలెడ్జివల్ల డేంజరేగాని సుఖం లేదు.

రచయిత్రులు చూడండి. నిశ్వసిస్తారు కాని నిట్టూర్చి అని వ్రాయరు. ఆర్ద్రనయనాలతో అంటారు – కళ్ళు చెమ్మగిల్లాయి అని వ్రాయరు. అప్రతిభులయారని వ్రాస్తారు. నిశ్చేష్టులయారని వ్రాయరు. తెలియని శాన్స్క్రిట్ మాటలు వూహూ గుప్పించేస్తూంటారు. తెలుగు మాటలు కాస్త లోకువ. అందుకని వాడరు. శైలి గొప్పగా వుండాలని మరమేకులు పెట్టి బిగించినట్లు తెలిసే తెలుగు మాటకు బదులు తెలియని సంస్కృతం మాటల్ను గుప్పించి మురిసిపోతూంటారు మన రైటరీమణులు.

అలాగైతే ఆపాటి శాన్స్క్రిట్ నాకూ వచ్చు. ఫామిలీ ప్లానింగ్ తీస్కోండి -

కన్యా లూపవతీ శత్రుః కాని భార్యా రూపవతీ శత్రుః కాదు. భార్యా అరూపవతీ శత్రుః అని మార్చుకోవాలి. భార్యా రూపవతీ మిత్రః అని వాడొచ్చో లేదో (పరిగెట్టుకు రేడియో స్టేషన్‌కి వెళ్ళి జరుక్ శాస్త్రి గారి లాంటి వారినడిగి రమ్మంటే అబ్బ కాళ్ళు నొప్పులంటారు మావారు. ఆర్ద్రనయనాలతో జేబురుమాలలోకి నిశ్వసిస్తు). లూప్ బిగింపులు వచ్చాక లూపవతులు లూపా ముద్రలు ఎక్కువై అంతా లూపాంతరం చెందుతున్నారు.

ఎంత ఛండాలపు రొమాన్సయినా సంస్కృతంలో వ్రాస్తే క్లాసికల్‌గా వుంటుంది. అదే శృంగారము తెలుగులో అఘోరిస్తే డర్టీగా నాస్టీగా వుంటుందట.

మొన్నీ మధ్య రేడియోలో కాశ్మీర పట్టమహిషి నాటిక వినాల్సొచ్చింది. నిద్రపట్టక ఉక్కబోస్తుంటే రేడియో తిప్పా. ఆ నాటకంలో పక్కా అమెరికన్ టైపు కట్‌త్రోట్ బిజినెస్ మాన్ ఉన్నాడు. వాడు వజ్రాల వర్తకుడు. కాశ్మీర్ చక్రవర్తికి పెళ్ళాన్ని అంటగట్టి వజ్రాల వ్యాపారం వృద్ధి చేసుకోవాలని సెకండ్ వైఫ్‌తో కలిసి ప్లాన్లు వేస్తుంటాడు.

ఆ మహేంద్ర ప్రభ ఎసుమంటి స్త్రీ రత్నమంటే, నృత్య సంగీత సాహిత్యాలన్నీ తెలిసిన అసమాన సౌందర్యవతి, సుగుణఖని, ఆభిజాత్యం కలది. తనకు పిల్లలు కలగడం లేదని భర్తకు పునర్వివాహం తనే స్వయంగా చేయించింది. అటువంటి స్త్రీని నెత్తిమీద పెట్టుకోవలసిన వజ్రాల శ్రేష్ఠి, రాజుగారిని మోహించమని పెళ్ళాన్ని వేపుకు తింటాడు. ఇంకానయం మా సిస్టర్ రంగనాయకమ్మగారు ఈ రేడియోనాటిక వింటే రేడియో బ్రద్దలు కొట్టేసుందురు. నాకూ అంత ఆవేశం వచ్చింది. కొంచెం తగ్గాను. మళ్ళీ నాలుగైదొందలు తగలేసి రేడియో కొనుక్కోలేం గదా! ఇంతకి మహేంద్రప్రభ దేవదాసీత్వం పొందింతరువాత నెమ్మదిగా కాశ్మీర్ చక్రవర్తి వలపు పిలుపును మన్నించి పట్టమహిషి అవుతుంది. అలాంటి భార్యా సమర్పణ చేసే ప్లాట్లు సంస్కృతంలో వుండబట్టి సరిపోయింది కాని తెలుగులో అలాంటి నాటిక వ్రాస్తే రేడియోవారు ప్రసారం చేస్తారా? కథ వ్రాస్తే పత్రికలు వేస్తాయా? ఎటువంటి శృంగారమైనా సంస్కృతంలో చెల్లినట్లు తెలుగులో చెల్లదు.

అప్పుడా సమాజంలో వ్యాపారస్థుడి భార్య అయినప్పటికీ భర్తను వదిలి మరొక పురుషుడ్ని పొంది పట్టమహిషి కాగలిగింది. ఇప్పుడా అడ్జస్టుమెంటాలిటీ ఏది? రామారావు పెళ్ళాన్ని తన్ని తగిలేస్తే ఏ భీమారావో కొన్నాళ్ళు చేరదీసినా తిరిగి ఆమె ఏ లాడ్జింగు హోమ్‌కో చేరాల్సిందేకాని, మినిస్టరు సంగతి అలా వుంచండి కనీసం అసెంబ్లీ మెంబరు లేదా, పార్లమెంటు మెంబరు కూడా అవలేదు. ఈ సొసైటీ ఆడదానికి సెక్యూరిటీ యివ్వలేదు. స్త్రీల సమస్య రోజురోజుకి కుప్పుసామయ్యర్ మేడ్ డిఫికల్టు అవుతోంది కాని, వెంకటసుబ్బారావు మేడీజి కావడంలేదు.

అంచేత సంస్కృతంలో - నిశ్వసించడం, ఆర్ద్రనయనాలతో చూడడం, ముఖాన్నంతా కాళిమ పులుముకొనడం, పాదధూళి నెత్తిమీద జల్లుకోవడం, యీ ముద్ద గోంగూర పచ్చడి

తినకపోతే నెత్తిబద్దలుకొట్టుకుని చచ్చిపోతాననడం, "యీ వంశం - యీ ఇల్లు - కుటుంబగౌరవం" అంటూ డొంకటర్నింగ్ డైలాగులు చెప్పి ఫామిలీ సెంటిమెంటుని బజార్న అమ్మజూపే రైటర్సంటే నాకు కోపంలేదుగాని చిరాకు.

సంస్కృతంలో బావున్నాయనిపించే పదాలూ, శ్లోకపాదాలూ తెలుగులో ఎందుకో బావుండవు. మచ్చుకి - కాంతా కుచాంబురుహ కుట్మలలోల దృష్టే.... అస్తమానూ యిదే పనా? అంచాతే తెలుగులో అశ్లీలం మాట్లాడేవాళ్ళని సంస్కృతం మాట్లాడుతున్నారంటారు.

సంస్కృతం నేర్చుకోకపోయినా వచ్చినట్లే వుంటుంది. తెలుగు నేర్చుకున్నారాదు.

అదుగో - మావారొచ్చినట్లున్నారు.

అబ్బ! ఇంత పాదధూళి మోసుకొచ్చారేవిటి చెప్పుల్తో... ముఖమంతా కాళిమ చేసుకోకండి. వేడ్నీళ్ళు తోడిస్తా - అప్పుడే గాఢంగా నిశ్వసించి అప్రతిభులై పోకండి. బాత్ రూంలోకి నడవండి. వీపు రుద్దుతాగా.

నీళ్ళోసుగోరూ! ఐతే ఆ పాదధూళితో అలాగే వుంటారన్న మాట! ఐ పిటీ యు.

# టైమ్ సెన్స్

ఆడదాన్ని మూల కూర్చోమని శాసించడానికెవరికీ అధికారం లేదు.

"తగులడ్డాను" అంటూ మునుపు ఆ మూడురోజులూ చిరుతిళ్ళు తెప్పించుకు తిని గోడల మీదకు ఎగబాకడం, నేలమీదపడి దొర్లడం అదేపనిగా నావెల్సూ, కథలూ, పత్రికలూ చదువుతూ వంటరాని మగాళ్ళను కాల్చుకు తినడం ఆచారం!

డాక్టర్ల పుణ్యమా అనీ, కాలేజీ అమ్మాయిల ధర్మమా అనీ ఈ మూఢాచారం యిప్పుడిప్పుడే మాయమవుతోంది.

ఆ మాటకొస్తే ఆడాళ్ళకు "టైమ్ సెన్స్" లేదని మగపురుషులు వెక్కిరిస్తారుకాని - ఎవరు ఎప్పుడు మూలకూర్చునేది. ఎవత్తికి నెల తప్పినది మన ఆడవాళ్ళు టక్కున యమకరెక్టుగా చెప్పగల్రు. కమింగ్ టు ది పాయింట్ - ఇప్పుడంతా ఇళ్ళలో కలిపేయడం ఫేషన్ కాబట్టి ఆడాళ్ళ రహస్యాలు ఆడాళ్ళకే అగమ్యగోచరంగా వుంటున్నాయి.

ఈ అమ్మమ్మల చాదస్తాలు పోతున్నాయని పీఠాధిపతులు గోల చేస్తున్నారు. ఇప్పుడు 'గోవిందా' అని తిరపతి కొండ ఎక్కేసి గుళ్ళోకి సైతం కాలేజి అమ్మాయిలు జొరబడి పోతున్నారట.

బాగుందా ఈ అభియోగం.

అందుకే ఆగ్రహించి ఆ 'సెవెన్ హిల్స్ హి' అంతమంది జనాన్ని క్యూలో చంపించేశాడట. అమ్మాయిల అపవిత్రతే కాని ఆలయాధికారుల అప్రమత్తత కారణం కాదట యీ ఘోరానికి.